క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉ. 11.30 గంటలకు ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి సకాలంలో రావాలని కోరారు. అలాగే, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

ఘనంగా ఓనం వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న కేరళవాసులు

షాద్‌నగర్: కేరళ మళయసీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నివాసం ఉండే కేరళవాసులు తమ సాంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా ప్రదర్శనలు నిర్వహించారు. వారు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లిబ్బి బెంజిమన్, థామస్, శ్యాంకుట్టి, జార్జి థామస్, సాజన్ జాకబ్, జగదీష్, రాజన్ అబ్రహం, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొమరబండలో శ్రీ బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస చివరి సోమవారం సందర్భంగా శివపార్వతులకు కల్యాణం, అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య శివ పార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. కార్యక్రమలో గ్రామ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు దేవేందర్‌రెడ్డి , గోపాల్‌రెడ్డి, ఈట శ్రీనివాస్, గ్రామస్తులు, తదితరులున్నారు.

అన్నదాన సత్రం నిర్మాణం



భూమిపూజ చేస్తున్న ఆలయ అర్చకులు

మొయినాబాద్‌రూరల్: భక్తుల సౌకర్యార్థం సంగమేశ్వర దేవాలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన సత్రం నిర్మిస్తున్నామని ఆలయ అర్చకులు రాజేశ్వర శర్మ అన్నారు. సోమవారం మండలంలోని కనకమామిడిలో సమీపంలో గల సంగమేశ్వర దేవాలయ వెనుక భాగంగా అన్నదాన సత్రం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. అన్నదాన సత్రం నిర్మాణం కోసం దాతల కృషితో చేపడుతున్నామని పేర్కొన్నారు. దాతలు ఎవరైనా సరే సత్ర నిర్మాణానికి విరాళాలు ఇవ్వవచ్చని కోరారు. కార్యక్రమంలో బల్వంత్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

మండలంలో 70 ఎంఎం వర్షపాతం నమోదు



రోడ్డుపై పారుతున్న వర్షం నీరు

కేశంపేట: మండలంలో 70 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు ఎంపీఎస్‌ఓ కళ్యాణి తెలిపారు. మండల పరిధిలోని సంగెంలో 81.3 ఎంఎం, తొమ్మిదిరేకులలో 24.3 ఎంఎం, కేశంపేట 93.2 ఎంఎం వర్షపాతం నమోదయిందని తెలిపారు. ఈ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. లింగంధన వాగుపై నుంచి వరద నీరు పారడంతో కొద్దిసేపు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే, వేములనర్వ, కేశంపేట గ్రామాల మధ్యన రోడ్డుపైన వాగు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు



వరద తాకిడికి ధ్వంసమైన కొందుర్గు మండలం టేకులపల్లి వంతెన



కోతకు గురైన రోడ్డు పక్కనే ఏర్పడిన పెద్దపెద్ద గుంతలు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కొందుర్గు: వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు, వంతెనలు దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొందుర్గు మండలంలో రామచంద్రాపూర్ నుంచి రేగడిచిల్కమర్రి, ఉత్తరాసిపల్లి నుంచి టేకులపల్లి, శ్రీరంగాపూర్ నుంచి అయోధ్యాపూర్‌తండా, తంగెళ్లపల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ఏ గుంతలోపడి ఎప్పుడు ప్రమాదం సంభవిస్తోందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. షాద్‌నగర్–పరిగి ఆర్అండ్‌బీ రోడ్డు అడుగడుగునా గుంతలే ఇక వంతెనల పరిస్థితి మరి దారుణంగా మారింది. సీకులు తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కొందుర్గు నుంచి ఉమ్మెంత్యాల, కొందుర్గు నుంచి తూంపల్లి, కొందుర్గు నుంచి గంగన్నగూడ, వెంకిర్యాల, ఎదిర రోడ్లు అధ్వానంగా మారాయి. ఉమ్మెంత్యాల నుంచి తుమ్మలపల్లి లాల్ పహడ్ రోడ్డుది అదే దుస్థితి. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ, జాకారం, ముష్టిపల్లి రోడ్లూ గుంతలమయంగా మారింది.



ధ్వంసమైన వంతెనను పరిశీలిస్తున్న గ్రామస్తులు

వంతెనలు ఇలా..

మండలంలోని టేకులపల్లి వంతెన, వెంకిర్యాల వంతెన, లాలాపేట వంతెన, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని రావిర్యాల వంతెన గుంతలు పడి అధ్వానంగా మారాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వంతెనలపై నుంచి వరదనీరు ప్రవహించి పూర్తిగా ధ్వంసమయ్యాయి. టేకులపల్లి గ్రామస్తులు సోమవారం ఉదయం జేసీబీతో వంతెనపై గుంతలు పూడ్చి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అనుకూలంగా మార్చుకున్నారు. మరో వర్షం కురిస్తే ఉన్న వంతెన వాగులో కొట్టుకుపోతుందని పలువురు అంటున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు, ఎమ్మెల్యేకు విన్నవించుకున్నా ఫలితం లేదని వాపోయారు.

అధికారులు..ప్రజాప్రతినిధులు..జర హిదర్ దేకో

షాబాద్: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రేగడిదోస్వాడ వాగు బ్రిడ్జిపై వరద ఉప్పొంగి ప్రవహించడంతో రోడ్డు కోతకు గురయింది. దీంతో పెద్ద పెద్ద గుంతల ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనని వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని, ప్రమాదాలు జరగక ముందే అధికారులు గుంతను పూడ్చాలని వేడుకొంటున్నారు.

ఆశవర్కర్లను అడ్డుకోవడం సరికాదు

సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా

కొత్తూరు: ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబా డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశవర్కర్లు తమ డిమాండ్ల సాధనకు సోమవారం చేపట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశలు, వారికి మద్దతు తెలుపుతున్న నాయకులను అడ్డుకోవడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం ఆశలకు హెల్త్‌కార్డులు , ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే, ఉద్యోగ భద్రత, పీఆర్సీ, పెండింగ్ యూనిఫామ్స్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కవిత, ఆశలు, అనిత, ఇందిరా, మహేశ్వరి, శోభా, లక్ష్మి, మాధవి, సుగుణ, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న సాయిబాబా

జేబీఆర్ఈసీలో గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

మొయినాబాద్ రూరల్: రాబోయే రోజుల్లో పేద విద్యార్థులకు అతితక్కువ ఖర్చుతో విదేశీ విద్యను అందించడమే సెయిన్ ఇమిగ్రేషన్ సర్వీస్ ముఖ్య లక్ష్యమని ఆ సంస్థ ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఆర్ఈసీ కాలేజీలో సోమవారం 'గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్– 2023' పేరుతో జాతీయ స్థాయి సదస్సును నిర్వహించారు. యూఎస్ఏ, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ తదితర దేశాల నుంచి దాదాపు 1,200 మంది విద్యార్థులు, 25 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని డాక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ అరుణ్‌మూర్తి, శ్రీనివాసరావు,విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సమ్మెకు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పూర్తి మద్దతు తెలిపి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సమాన పనికి సమాన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించడంతో పాటుగా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగయ్య, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు జయమ్మ, ఊర్మిల, జయగౌడ్, నాగజ్యోతి, పద్మ, పుష్ప, రత్నమ్మ, ఇందిర, తులసి, నిర్మల, మమత, భారతమ్మ, చంద్రకళ, మల్లేశ్వరి, సంగీత, శారత, వీణ, మంజుల, గిరిజ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

చేవెళ్ల: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో గత 48 ఏళ్లుగా పనిచేస్తున్నా తమను ప్రభుత్వం గుర్తించటం లేదన్నారు. ఉద్యోగులపై ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని వాపోయారు. గత నెల 18న ఐసీడీఎస్ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చర్చలు జరిపారని, సమస్యలు పరిష్కరిస్తామనే హామీ ఇవ్వలేదని అన్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలంలోని అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఉమా, స్వప్న, ప్రవీన, కవిత, సరస్వతి, గిరిజ, చంద్రకళ, కల్పన, ప్రేమలత, సౌభాగ్య పద్మారాణి, మంగమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్: గణేష్ మండపాల నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పేర్కొన్నారు. సోమవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రతాప్‌లింగం అధ్యక్షతన గణేష్ మండపాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రంగస్వామి మాట్లాడుతూ.. ఫరూక్‌నగర్, షాద్‌నగర్‌లో మొత్తం 300కు పైగా గణేష్ మండపాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండపాల అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు దేవకి, శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా కొలన్ ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు**



షాబాద్: రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడు కొలన్ ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం మండలంలోని మద్దూరు బాలాజీ గార్డెన్‌లో కేపీఆర్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూర్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి తదితరులు ప్రభాకర్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కొలన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ సుధ యాదయ్య, కేపీఆర్ యువసేన సభ్యులు కొలన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

◆ **ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ**

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అమ్డాపూర్ హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వేడుకలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. వేదపండితులు, పూజారులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. చివరి రోజు సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు క్రేన్ సహాయంతో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

◆ **మార్మోగిన శివనామస్మరణ**

మొయినాబాద్‌రూరల్: హరహర మహాదేవ శంభోశంకర అంటూ మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. సోమవారం శ్రావణమాసం నాల్గొవ వారం కావడంతో మండల పరిధిలోని కనకమామిడి సమీపంలోని సంగమేశ్వర స్వామి దేవాలయంలో కుంకుమార్చన పూజలను వేదపండితులు, పూజారులు నిర్వహించారు. జంట నగరాలతో పాటు మండలంలోని చుట్టూ పక్కల గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దీంతో సంగమేశ్వర దేవాలయం కుంకుమార్చన పూజల సందర్భంగా శివనామంతో మార్మోగింది.

◆ **వైభవంగా గంప జాతర ఉత్సవాలు**

చేవెళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం గంప జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ పూజారులు వామనాచార్యులు, శ్రీకాంత్, శ్రీపాదు, వాసదేవాచార్యులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది శ్రావణ మాసం చివరి సోమవారం గంపజాతర ఉత్సవాలు (గరుడ వాహన సేవలు) చేయడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. స్వామివారిని గరుడవాహన సేవ ఊరేగింపు వైభవంగా సాగింది. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను దేవాలయ ఈఓ నరేందర్, పూజారులు ఏర్పాటు చేశారు.

◆ **'విజయభేరి'ని విజయవంతం చేద్దాం**

చేవెళ్ల: ఈనెల 17న నిర్వహించనున్న కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు వసంతం, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి పెంటయ్యగౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుక్కుగూడ రాజీవ్‌ప్రాంగణంలోని నిర్వహించే సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ బాలయ్య, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

◆ **భారీ వర్షం.. మత్తడి దూకుతున్న వరద**

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షానికి వాగులు, వంకలు పరవళ్ల తొక్కాయి. చెరువులు, కుంటలు నిండు కుండల్లా మారాయి. మండల పరిధిలోని బూర్గుల, జోగమ్మగూడ, రాయికల్, మొగిలిగిద్ద, అయ్యవారిపల్లి తదితర గ్రామాల చెరువులు నిండి అలుగులు పారాయి. బూర్గుల పరిధిలోని మామిడికుంట, కొత్తకుంట చెరువులు నిండి అలుగు పారడంతో కాశిరెడ్డిగూడ నుంచి చింతగూడకు వెళ్లే రహదారి వరద ఉధృతికి పూర్తిగా దెబ్బతింది. అయ్యవారిపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సీఐ ప్రతాప్‌లింగం వాగు పరివాహక ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించారు. వాగు సమీపంలో పోలీసులతో పహారా ఏర్పాటు చేశారు.

అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరిక

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: అభివృద్ధికి ఆకర్షితులై ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరడం సంతోషకరమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కొడిచర్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు గమనిస్తున్నారని వివరించారు. ఇతర పార్టీల మాదిరిగా హామీలతోనే సరిపెట్టకుండా ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని పెండింగ్ పనులను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మెండెకృష్ణ, రవీందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, జంగయ్యయాదవ్, వినయ్, రాజు, జనార్దన్‌యాదవ్, ప్రతాప్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మాణిక్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి

కేశంపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ దైవచింతనతో ఉండాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లిలో సోమవారం పోచమ్మ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఎమ్మెల్యే పాల్గొని దేవాలయ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పండుగలను ప్రజలు కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ లక్ష్మమ్మ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, యాదగిరిరావు, వెంకయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

సమష్టి పోరాటంతోనే రాజ్యాధికారం



ధర్నా చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేందర్

షాద్‌నగర్: అందరు సమష్టిగా పోరాటం చేస్తేనే బడుగులకు రాజ్యాధికారం సాధ్యమని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాజ్యాధికార సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. జనాభాలో ఏడు శాతం కూడా లేని అగ్రకులాల వారు పార్టీలకు నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. జనాభాలో 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు నాయకత్వం కోసం పోరాటం చేయాలని సూచించారు. సమష్టి పోరాటం చేస్తే రాజ్యాధికారం సాధ్యమవుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు బడుగు బలహీన వర్గాల ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, రాకేష్, నర్సింహ్మ, అశోక్‌గౌడ్, అంచరాములు, మంగమధు, శ్రీధర్, సతీష్, శ్రీనివాస్‌గౌడ్, జగన్‌గౌడ్, పాషా, రవీంద్ర, రమేష్, పెంటయ్య, శ్రీను, గిరి, ప్రశాంత్, చెన్నయ్య, శివ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏఎస్సై గోపాల్



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్‌పోలీసులు

మొయినాబాద్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏఎస్సై గోపాల్ హెచ్చరించారు. సోమవారం మొయినాబాద్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపొద్దని తెలిపారు. బస్టాప్‌కు దూరంగా రోడ్డు పక్కన వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఆటోలు నిలపాలన్నారు. ప్రతి సోమవారం మొయినాబాద్‌లో సంత(అంగడి) ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజేందర్‌గౌడ్, హోంగార్డులు మల్లేష్, రాజమౌళి ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాల అభ్యున్నతి



సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సీ సెల్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో బడుగు బలహీన వర్గాల వారు పూర్తిగా వెనకబాటుకు గురయ్యారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్, బీజేపీలను నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ఈ సందర్భంగా నూతన బీసీసెల్ గ్రామకమిటీ అధ్యక్షుడిగా రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా వినోద్ కుమార్, కుమార్, చాకలి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా భీష్య రమేష్, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, ఎన్.నర్సింలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరేష్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, కార్యదర్శిగా ప్రభాకర్, కోశాధికారిగా బాల్‌రాజ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, చందు, గణేశ్, యాసిన్, చాకలి రమేష్, రాములు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలోని శేరీల మైసమ్మ దేవత బోనాల ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పసుపు, కుంకుమలు, వేపకొమ్మలతో అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గ్రామాల్లో బోనాల సందడి

కేశంపేట: మండల పరిధిలోని బోధునంపల్లి, నిర్దవెల్లి, లేమామిడి, కేశంపేట గ్రామాల్లో సోమవారం శ్రావణమాస బోనాల సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో మహిళలు బోనాల ఎత్తుకొని ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సర్పంచులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. కార్యక్రమాల్లో తలసాని వెంకట్‌రెడ్డి, మఠం చంద్రశేఖర్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గులో బోనాలతో వస్తున్న మహిళలు

నవీన్‌కుమార్ సేవలు అభినందనీయం



నవీన్‌కుమార్‌కు మెమెంటో అందజేస్తున్న గరికపాటి

పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ నవీన్‌కుమార్ ఎల్ఐసీలో అందిస్తున్న సేవలు అభినందనీయమని పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు కొనియడారు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో సోమవారం ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గరికపాటి హాజరై నవీన్‌కుమార్‌కు మెమెంటోను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్, ఉన్నత విద్యతో పాటుగా అమ్మాయిల వివాహం కోసం ఎల్ఐసీ అందిస్తున్న కిడ్డీ బ్యాంక్ సేవలు నిరుపేదల ఉన్నతికి ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. రోజు వారి పొదుపుపై ప్రజలను చైతన్యం చేస్తున్న నవీన్‌కుమార్ సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో గంప నాగేశ్వర్‌రావు, నైనాజైస్వాల్, జగన్ పాల్గొన్నారు.